సాక్షి సూర్యాపేట

ఆదివారం, 4, మే, 2025

I



కలను నిజం చేస్తూ..

చివ్వెంల మండలానికి చెందిన గిరిపుత్రిక జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై తల్లిదండ్రుల కల సాకారం చేసింది. - IIలో



ధాన్యం లారీల పట్టివేత

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీలను పోలీసులు పట్టుకున్నారు. - IIలో



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు కోదాడ, హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్, కోదాడ : రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం హుజూర్‌నగర్, కోదాడలో పర్యటించనున్నారని మంత్రి పీఆర్‌ఓ వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు కోదాడ బస్టాండ్ సెంటర్‌లో వడ్డెర ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోదాడలోని వంద పడకల వైద్యశాల స్థలం, నిర్మాణ విషయంపై, రెడ్లకుంట, శాంతినగర్, పాలేరు ఎత్తిపోతల పథకాలపై అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం హుజూర్‌నగర్‌కు వెళతారు. అక్కడ 241 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని మంత్రి పీఆర్‌ఓ పేర్కొన్నారు.

జిల్లా కోర్టుకు వేసవి సెలవులు

చివ్వెంల: జిల్లా కోర్టుకు ఈనెల 5 నుంచి జూన్ 6వ తేదీ వరకు సెలవులు ప్రకటిస్తూ హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సెలవుల్లో సివిల్ కేసులకు సబంధించిన ఫైలింగ్‌లను పరిశీలించేందుకు ప్రత్యేక జడ్జీలకు బాధ్యతలు అప్పగించారు. మొదటి వెకేషన్‌లో భాగంగా ఈనెల 5 నుంచి 21 వరకు 17 రోజుల పాటు సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద కేసులు పరిశీలిస్తారు. అలాగే 22 నుంచి జూన్ 6 వరకు నల్లగొండ జిల్లా కోర్టు పోక్సో జడ్జి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్‌రావు బాధ్యతలు చేపడతారు. కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి కోర్టులకు సబంధించిన సివిల్ కేసు దావాలు, క్రిమినల్ కేసులను సంబంధిత కోర్టుల జడ్జీలు పరిశీలించనున్నారు.

నాలుగు ఆసుపత్రులకు షోకాజు నోటీసులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఆపిల్ స్కాన్ సెంటర్, శ్రీకృష్ణా, శ్రీ సాయిగణేష్ మల్టీస్పెషాలిటి, శరత్ కార్డియాక్ సెంటర్ ఆసుపత్రులకు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ నిబంధనలను అనుసరించి షోకాజు నోటీసులు జారీ చేసినట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు రోజుల వ్యవధిలోపు సరైన వివరణ, ధ్రువపత్రాలు సమర్పించని పక్షంలో సంబంధిత ఆసుపత్రుల అనుమతులను రద్దు చేయనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేశామని, తనిఖీలు నిర్వహించి స్పష్టమైన ధ్రువపత్రాలు కలిగి ఉన్న వారికి మాత్రమే అనుమతి రిజిస్ట్రేషన్ కొనసాగించనున్నామని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం మారినా, డాక్టర్, సిబ్బంది మారినా జిల్లా వైద్యారోగ్యశాఖకు తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

గరిడేపల్లి: భూ భారతి అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గరిడేపల్లి మండలంలో ఈనెల 5 నుంచి 12వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శనివారం గరిడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన భూ భారతి రెవెన్యూ సదస్సులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5న రాయినిగూడెం జెడ్పీహెచ్ఎస్, తాళ్లమల్కాపురం యూపీఎస్, 6న కాల్వపల్లి ఎంపీపీఎస్, గడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్, 7న గరిడేపల్లి జెడ్పీహెచ్ఎస్, కుతుబ్‌షాపురం యూపీఎస్, 8న గానుగబండ, వెలిదండ జెడ్పీహెచ్ఎస్, 9న సర్వారం యూపీఎస్, పోనుగోడు జెడ్పీహెచ్ఎస్, 12న కల్మలచెరువు జెడ్పీహెచ్ఎస్‌లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. సివిల్ వివాదాలు, కోర్టులో ఉన్న భూ కేసుల దరఖాస్తులను ఈ సమావేశాల్లో స్వీకరించబోమన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఏఓ రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ కవిత, డీటీ ప్రవంతి, ఆర్ఐ రాంబాబు, ప్రవీణ్, కార్యదర్శి సైదానాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

సూర్యాపేట అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈ నెల 20న దేశ వ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మధు పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎం.రాంబాబు, నెమ్మాది వెంకటేశ్వర్లు, వెంకన్న, గోపి పాల్గొన్నారు.

ఎండలు మండనున్నాయ్.. వానలూ కురవనున్నాయ్..

రెండు రోజులు అలర్ట్!

ఇప్పటికే 43 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు

- రానున్న రెండు రోజులు మరింత పెరగనున్న ఎండల తీవ్రత
- ఉరుములు, మెరుపులతో వర్షాలు కూడా కురుస్తాయంటున్న వాతావరణ శాఖ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వచ్చే రెండు రోజుల పాటు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వాతావరణ పరిస్థితులు మారనున్నాయి. ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటిపోయయి. ఎండల తీవ్రత పెరగడంతోపాటు.. వచ్చే రెండు రోజులు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

మార్చిలోనే మొదలైన ఎండలు

ఉమ్మడి జిల్లాలో ఎండల తీవ్రత పెరుగుతోంది. మార్చిలోనే మొదలైన ఎండలు ఏప్రిల్ చివరి నాటికి అధికమయ్యాయి. ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవని, అయితే ఆది, సోమవారం తర్వాత ఎండలు కాస్త తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దు

ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండటమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే టోపీ ధరించడం, తలకు తువాలు చుట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని, నీడ ప్రదేశాల్లో మాత్రమే ఉండాలని, ఎక్కువ మోతాదులో మంచినీరు, మజ్జిగ, పండ్ల రసాల వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు చేసుకోవాలని చెప్పారు. ఉపాధి కూలీలు ఉదయం వేళల్లో పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పని ప్రదేశంలో షామియానాలు ఏర్పాటు చేసుకోవాలని, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.

శనివారం ఉష్ణోగ్రత 43 డిగ్రీలు దాటిన గ్రామాలు ఇవే

మండలం	గ్రామం	ఉష్ణోగ్రత
దామరచర్ల	దామరచర్ల	43.8
మాడుగులపల్లి	మాడుగులపల్లి	43.7
దామరచర్ల	తిమ్మాపూర్	43.6
మిర్యాలగూడ	టేక్యాతండా	43.4
త్రిపురారం	మాటూరు	43.3
అడవిదేవులపల్లి	ముల్కచర్ల	43.2
నార్కట్‌పల్లి	నార్కట్‌పల్లి	43
తిరుమలగిరిసాగర్	తిరుమలగిరిసాగర్	43
మోతె	మామిళ్లగూడెం	43.1

అప్రమత్తంగా ఉండాలి



భానుపురి (సూర్యాపేట): జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మధ్యాహ్నం వేళ ఎట్టి పరిస్థితుల్లో ఇళ్ల నుంచి బయటకు రావొద్దు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలి. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయాలని ఆదేశించాం. చిన్నారులు, వయోవృద్ధులు ఎండకు బయటకు వెళ్లవద్దు. ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటితో పాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలి. అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించినా ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించి చికిత్స పొందాలి.

– కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

---

4 సెంటర్లు.. 890 మంది విద్యార్థులు

నేడు నీట్ పరీక్ష

- సూర్యాపేటలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

సూర్యాపేటటౌన్ : మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు దేశ వ్యాప్తంగా ఆదివారం (4వ తేదీ) నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)–2025కు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాలైన మోడల్ స్కూల్ ఇమాంపేట, టీజీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్–కళాశాల (బాలికలు) ఇమాంపేట, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్–జూనియర్ కళాశాల దురాజ్‌పల్లి చివ్వెంల మండలం, గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాల్లో 890 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

మధ్యాహ్నం 1:30గంటల వరకే అనుమతి

విద్యార్థుల బయోమెట్రిక్ తీసుకుంటున్నందున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష హాల్‌లోకి అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత గేట్లు మూసివేస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద జామర్లను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కంట్రోల్ రూం, సీసీ కెమెరాలు, బందోబస్తు, 144 సెక్షన్ అమలులో ఉంటుంది.



ఇమాంపేట సెంటర్‌లో నంబరింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అన్ని ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

నీట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం సూర్యాపేట పరిధిలో నాలుగు చోట్ల ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు ఆభరణాలు, ఫుల్ హ్యాండ్ షట్స్, బూట్లు ధరించి వచ్చినా, ఎలక్ట్రానిక్ పరికరాలతో వచ్చినా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. అభ్యర్థులకు సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1433 ఫోన్ చేయాలన్నారు. ఆయన వెంట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ వేణుమాధవరావు, తహసీల్దార్లు శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జయలత ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు

- నెలాఖరు వరకు కొనసాగింపు
- టీచర్లు, ఆయాలకు చెరో 15 రోజులు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

చిలుకూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఈ నెల 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. అయితే టీచర్లకు ఈ నెల 15 వరకు, ఆయాలకు 16 నుంచి ఈనెల 31 వరకు సెలవులు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలలో టీచర్లు, ఆయాలు చెరో 15 రోజులు పనిచేయాల్సి ఉంటుంది. దీంట్లో భాగంగా ఇళ్ల వద్దకు వెళ్లి పిల్లలకు పౌష్టికాహారం విధిగా అందజేయాలని ఆదేశాలు పంపింది. జూన్‌లో మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ సర్వే చేయాలని ఆదేశించింది. అలాగే బడి మానేసిన పిల్లలను గుర్తించి పునఃప్రవేశాలు కల్పించాల్సి ఉంటుంది. ఐదేళ్ల లోపు పిల్లల ఎదుగులకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తారు. కాగా జిల్లాలో 1,209 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అయి తే తమ విన్నపం మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వడంపై అంగన్‌వాడీల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

చివ్వెంల : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి ఫర్హీన్ కౌసర్ అన్నారు. శనివారం సూర్యాపేట సబ్ జైలును సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. ఖైదీలను భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణంలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన లీగల్ లిటరసీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆటో డ్రైవర్ల హక్కులు, విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో బార్ అసోసియేసన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, డిఫెన్స్ కౌన్సిల్స్ బొల్లెద్దు వెంకటరత్నం, బట్టుపల్లి ప్రవీణ్‌కుమార్, పెండెం వాణి, న్యాయవాదులు ఎండీ అబ్దుల్ లతీఫ్, శ్రీనివాస్, డీఎల్ఎస్ఏ నామినేటెడ్ సభ్యులు అల్లంనేని వెంకటేశ్వర్‌రావు, మధు, పీపీ లక్ష్మణ్ నాయక్, ఏజీపీ పూల్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్

రాపిడో రయ్ రయ్!

నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి పట్టణాల్లో అందుబాటులోకి బైక్, ఆటో ట్యాక్సీ సేవలు

మనం ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లాలంటే బస్సు లేదా ఆటో, సొంత వాహనం అవసరం. కానీ ఇప్పుడు రాపిడో యాప్‌లో బుక్ చేసుకుంటే వాహనం మన ముందు కొచ్చి ఆగుతుంది. గమ్య స్థానానికి చేర్చుతుంది. ఇప్పటి వరకు నగరాలకే ప్రాంతాలకే పరిమితమైన ఇలాంటి బైక్ ట్యాక్సీ సర్వీసులు ఇప్పుడు జిల్లా కేంద్రాలకు విస్తరించాయి. వీటి రాకతో ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందుతున్నాయి. డబ్బు, సమయం ఆదా అవుతోంది. ప్రస్తుతం రాపిడో యాప్‌లో బైక్, ఆటో సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీని ద్వారా నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతోంది. పార్ట్ టైం ఉద్యోగులకు కొంత ఆదాయ వనరుగా మారింది.

- అనుకున్న లోకేషన్‌కు సులువుగా చేరుకుంటున్న ప్రజలు
- డబ్బు, సమయం ఆదా
- ఉపాధి పొందుతున్న యువత

– రామగిరి(నల్లగొండ), సూర్యాపేట టౌన్, భువనగిరి టౌన్



ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, భువనగిరిలో 'రాపిడో' సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆయా పట్టణాల పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లేందుకు రాపిడో యాప్ ద్వారా ఆటో, బైక్ బుక్ చేసుకుంటే చాలు మన ఇంటి దగ్గరకే ఆటో, బైక్ వచ్చి మనల్ని పికప్ చేసుకుంటాయి. అందుకు ముందుగా మనం చేయవలసిందల్లా మన సెల్‌ఫోన్‌లోని 'ప్లే స్టోర్' నుంచి 'రాపిడో' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం కొన్ని ఆప్షన్స్ పూరించాక అది మన సేవలకు సిద్ధమవుతుంది. మనం ఎక్కడికైనా వెళ్లాలనుకుంటే యాప్ ఓపెన్ చేస్తే వెళ్లే లోకేషన్ అడుగుతుంది. దాన్ని పూరించాక, ప్రయాణ చార్జీని తెలుపుతుంది. మనకు సమ్మతమైతే వెంటనే ఓకే ఆప్షన్ నొక్కగానే వాహనం మన దగ్గరకు ఎన్ని నిమిషాల్లో చేరుకుంటుందో తెలియజేస్తుంది. వాహనం రాగానే మనల్ని పికప్ చేసుకుని, గమ్య స్థానానికి చేరుస్తుంది. ఇది పట్టణ ప్రజల రవాణా సౌకర్యార్థం, నిరుద్యోగుల ఉపాధికి బాసటగా నిలుస్తోంది. ఇప్పుడు ప్రజల్లోకి పూర్తిగా అవగాహన కలిగించడానికి రాపిడో సంస్థ ఆటో, బైక్ రైడర్ల ద్వారా తన వంతు వాటాను తీసుకోవడంలేదని ఒక ఆటోవాలా తెలిపాడు. తమకు గిరాకీ అంతంతే ఉందని, నెమ్మదిగా ప్రజల్లో అవగాహన కలిగి తమ సేవలను విస్తృతంగా వినియోగించుకుంటారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నల్లగొండలో 90 వాహనాలు..

- నల్లగొండ పట్టణంలో రాపిడోలో 90 వరకు వాహనాలు నడుస్తున్నాయి. పట్టణం పరిధిలో ప్రస్తుతం కేశరాజుపల్లి, ఎస్ఎల్‌బీసీ, కతాల్‌గూడ, పానగల్లు, ఎంజీ యూనివర్సిటీ వరకు ఈ సేవలు కొనసాగుతున్నాయి. డిమాండ్ పెరిగితే ఇంకా విస్తరించే అవకాశం ఉంది.
- రాపిడో సర్వీసులు భువనగిరి, యాదగిరిగుట్ట, బీబీనగర్ పట్టణాల్లోనూ అందుబాటులోకి వచ్చాయి. వీటి రాకతో ప్రజలకు ఎంతో సౌకర్యవంతమైన సేవలు అందుతున్నాయి. యాదిరిగుట్ట నుంచి ఎయిమ్స్ వరకు ఆటో, బైక్ సెలవు అందుబాటులో రావడంతో పాటు, బీబీనగర్ ఎయిమ్స్ నుంచి కార్లు కూడా అందుబాటులో వచ్చాయి.
- సూర్యాపేటలో ప్రస్తుతం రాపిడోలో 30 బైక్‌లు, 20 గాఆటో ట్యాక్సీలు నడిపిస్తున్నారు. గతంలో సూర్యాపేట పట్టణం పరిసర ప్రాంతాలు చుట్టూ ఆరు కిలోమీటర్ల వరకు రాపిడో ట్యాక్సీలు నడిపించారు. ఇప్పుడు జిల్లా కేంద్రం నుంచి 50 కిలోమీటర్ల వరకు కూడా ట్యాక్సీలు నడిపిస్తున్నారు. దీంతో ప్రయణికులు వారు వెళ్లే ప్రాంతానికి రాపిడో బుక్ చేసుకుంటున్నారు.

యువతకు ఉపాధి అవకాశం

రాపిడో యాప్ ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి పొందుతోంది. ముఖ్యంగా చిన్నచిన్న ఉద్యోగాలు లేదా ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే యువత పార్ట్‌టైంగా రాపిడో యాప్ ద్వారా ప్రయాణికులను చేరవేసి ఆదాయం పొందుతోంది. ముందుగా యువత రాపిడో కెప్టెన్ అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకొని వాహన వివరాలు, లైసెన్స్, మొబైల్ నంబర్లను పొందుపర్చాలి. ఎవరైతే ప్రయాణికుడిగా దగ్గరగా ఉంటారో వారికి మెసేజ్ వెళ్లడంతో క్షణాల్లో అక్కడి వెళ్లి ప్రయాణికుడిని గమ్యస్థలం చేరుస్తున్నారు. ఫుల్‌టైం పని చేసేవారు రోజుకు రూ.700 నుంచి రూ.1000 వరకు సంపాదించే అవకాశం ఉంటుంది. అయితే వీరంతా ఆ డబ్బును వారంలో రెండు సార్లు మాత్రమే తమ ఖాతా నుంచి డ్రా చేసుకోవాల్సి ఉంటుంది.



రాపిడో సేవలు వినియోగించుకుంటున్నా..



సూర్యాపేటలో కూడా రాపిడో సేవలు వచ్చాయని ఇటీవలే తెలిసింది. వెంటనే నా ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాను. అత్యవసర సమయంలో పట్టణంలో ఎటూ వెళ్లాలన్నా రాపిడోలో బైక్ ట్యాక్సీ బుక్ చేసుకుంటున్నా. క్షణాల్లో మన ముందు బైక్ ఉంటుంది. ప్రయాణం కూడా సులవవుతుతుంది. రాపిడో సేవలను వినియోగించుకుంటున్నా. చార్జెస్ కూడా తక్కువగానే ఉంటున్నాయి.

– బదావత్ నాగేశ్వర్‌రావు, సూర్యాపేట

ఎస్సారెస్పీకి లైనింగ్ వేయరూ..!

ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని ప్రాజెక్టు-2 కాలువలు

- చివరి ఆయకట్టుకు నీరందని వైనం
- ఏడేళ్లుగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఈసారి బడ్జెట్‌లో రూ.34.01కోట్లు మాత్రమే కేటాయింపు
- నేడు తాటిపాములలో మంత్రి ఉత్తమ్ పర్యటన
- మంత్రి హామీలపై రైతుల ఆశ



జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ సమీపంలో 71 డీబీఎం కాలువ దుస్థితి

అర్వపల్లి: తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో 2.20లక్షల ఎకరాలకు సాగునీరందించే శ్రీరాంసాగర్ రెండోదశ (ఎస్సారెస్పీ స్టేజ్–2) లైనింగ్, పునరుద్ధరణ పనులకు ఏళ్లుగా మోక్షం లభించడం లేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2010లో ఎస్సారెస్పీ రెండోదశ కాలువ నిర్మాణ పనులు పూర్తవగా ఏడేళ్ల నుంచి ప్రతి సీజన్‌కు గోదావరి జలాలలను జిల్లాకు వదులుతున్నారు. కానీ, అప్పటి నుంచి ఈ కాలువకు లైనింగ్, ఇతర మరమ్మతులు చేపట్టింది లేదు. దీంతో అక్కడక్కడా కట్టలు తెగుతూ, తూములు ధ్వంసమవుతూ నీరు వృథాగా పోతూ చివరి భూములకు నీరందని పరిస్థితి నెలకొంది.

రూ.500 కోట్ల నిధులు అవసరమున్నా..

జిల్లాలో ఎస్సారెస్పీ రెండోదశ కింద మూడు నియోజకవర్గాలకు సాగు నీరందించేందుకు 61,70, 71 డీబీఎం(డిస్ట్రిబ్యూటరీ మేజర్)లు ఉన్నాయి. ఇందులో 71డీబీఎం పెద్దది. 69 డీబీఎం తిరుమలగిరి, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాల్లో 27కి.మీ. మేర విస్తరించి ఉంది. దీనికింద 60,572 ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే 70 డీబీఎం నాగారం, తిరుమలగిరి మండలాల్లో 9కి.మీ. మేర విస్తరించి ఉంది. దీని కింద 7వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 71 డీబీఎం తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, నాగారం, సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్, మోతె, మునగాల, నడిగూడెం మండలాల్లో 68.45కి.మీ. మేర విస్తరించి ఉంది. దీనికింద 1,42,230 ఎకరాల ఆయకట్టు ఉంది.

ఎస్సారెస్పీ-2 స్వరూపం..

ఆయకట్టు	2.20 లక్షల ఎకరాలు
ప్రధాన డీబీఎంలు	69, 70, 71
నీళ్లందే ప్రాంతాలు	తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ

ఇందులో కేవలం 71డీబీఎం పరిధిలో మాత్రమే గత కొన్నేళ్ల కిందట సుమారు 5కి.మీ. పైన లైనింగ్ చేసి మిగతాది వదిలేశారు. 69, 70, 71డీబీఎంలతో పాటు వీటి కింద ఉన్న ప్రధాన మైనర్లు 22ఎల్, 36ఎల్, 7ఎల్, 15ఎల్, 22ఆర్, 69టెయిలాండ్‌కు మరమ్మతుతోపాటు లైనింగ్, తూములు, షట్టర్ల రిపేర్లు జరగాల్సి ఉంది. ప్రస్తుతం కాలువలు కంపచెట్లు, పూడికతో నిండిఉన్నాయి. అయితే లైనింగ్, మరమ్మతులకు రూ.500 కోట్ల వరకు నిధులు అవసరమున్నా ఈ సారి బడ్జెట్‌లో కేవలం రూ.34 కోట్లే కేటాయించారు. ఈ నిధులు ఎటూ సరిపోవని అధికారులే అంటున్నారు.

తాటిపాములకు నేడు మంత్రి ఉత్తమ్ రాక

తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో తన స్వగ్రామమైన తాటిపాములలో ఆదివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్యటించనున్నారు. ఇక్కడ పలు అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపనుల చేయనున్నట్టు సమాచారం. మంత్రి పర్యటన ఈ నేపథ్యంలో ఏటా అధికారులు పంపుతున్న ప్రతిపాదనల ఆమోదిస్తారో లేదోనని రైతులు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే ఇక్కడి రాబోతున్న మంత్రి ఎస్సారెస్పీ కాలువల దుస్థితిని పరిశీలించి బడ్జెట్‌తో సంబంధం లేకుండా తగినన్ని నిధులు కేటాయించాలని కాలువలను ఆధునీకరించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



ఎస్సారెస్పీ–2 కాలువల పునరుద్ధరణకు రూ.500 కోట్ల నిధులు అవసరముండగా ఈ సారి బడ్జెట్‌లో కేవలం రూ.34 కోట్లు కేటాయించడం సమంజసం కాదు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇక్కడకు వస్తున్నందున నిధుల కేటాయింపుపై దృష్టిపెట్టాలి.

– వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

గోదావరి జలాలే ఆధారం



ప్రతి సీజన్‌లో పది ఎకరాల వరకు వరిపంట సాగు చేస్తాను. కేవలం గోదావరి జలాలను నమ్ముకొని పంటలు సాగు చేస్తున్నాను. గతేడాది నుంచి నీళ్లు సరిగా రావడం లేదు. కాలువలు కంపచెట్లతో నిండాయి. వెంటనే కాలువలను బాగు చేయాలి.

– చెరుకుపల్లి ప్రవీణ్, రైతు, తిమ్మాపురం

తాటిముంజ.. తింటే మజా





- ఎండల తీవ్రతకు పెరుగుతున్న తాటిముంజల విక్రయం
- ముంజలలో అనేక పోషకాలు ఉంటాయంటున్న వైద్య నిపుణులు
- డజన్ రూ.100 వరకు అమ్మకం
- వేసవిలో ఉపాధి పొందుతున్న గీత కార్మికులు, వ్యాపారులు

యాదగిరిగుట్ట రూరల్: వేసవి కాలంలో మాత్రమే దొరికే తాటిముంజలను చిన్నపిల్లల నుంచి పెద్దవారి దాకా ఎంతో ఇష్టంగా తింటారు. వీటినే ఐస్ యాపిల్ అని కూడా అంటారు. ఈ తాటిముంజల్లో అమితమైన పోషకాహార పదార్థాలు ఉంటాయి. అందువల్ల ప్రతిఒక్కరూ ఈ ముంజలను తినడానికి ఎంతో ఇష్టపడతారు. వేసవి కాలంలో ఈ తాటిముంజలు తినడం వలన, ఎండ వేడికి ఉపశమనంతో పాటు ఆరోగ్యానికి అనేక రకాలైన ప్రయోజనాలు చేకూరుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. పల్లెల్లో మాత్రమే లభించే ఈ తాటిముంజలు ఇప్పుడు పట్టణాలకు కూడా తాకాయి. ముంజల అమ్మకంతో వేసవి కాలంలో ఉపాధి కూడా లభిస్తుందని గీత కార్మికులు, పండ్ల వ్యాపారులు చెబుతున్నారు.

జాతీయ రహదారుల వెంట అమ్మకం

వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిలో తాటి ముంజల అమ్మకం విపరీతంగా పెరిగిపోయింది. ఆలేరు బైపాస్, వంగపల్లి, రాయగిరి, గూడూరు టోల్‌ప్లాజా గుండా వెళ్తున్న వాహనాలతో పాటు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులు ఎక్కువగా తాటిముంజలను కొనుగోలు చేస్తున్నారు. వీటితో పాటు ఇతర ప్రధాన కూడళ్లలో కూడా తాటిముంజలను అమ్ముతుండడంతో వాహనదారులు వాటిని చూసి కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. వేసవి కాలంలో తాటి ముంజలు అమ్మకాలు పెరిగిపోవడంతో పలువురికి ఉపాధి కూడా లభిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని పండ్ల వ్యాపారులు, గీత కార్మికులు తదితరులు తాటిముంజల గెలలను గ్రామాల్లో నుంచి తీసుకొచ్చి జాతీయ రహదారులపై, ప్రధాన కూడళ్లలో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

తాటిముంజలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు

- శరీరంలో వేడిని తగ్గిస్తుంది
- బాడీని డీహైడ్రేషన్ నుంచి కాపాడుతాయి
- గర్భిణులకు ఎసిడిటీ నుంచి రక్షణ కల్పిస్తుంది
- మలబద్ధకం వంటి సమస్యలను తొలగిస్తుంది
- కాలేయం, బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు ఉపయోగపడతాయి
- అధిక బరువును తగ్గిస్తుంది
- గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉపయోగపడుతుంది
- రక్తపోటును అదుపులో ఉంచుతుంది
- జీర్ణశక్తిని పెంచుతుంది
- ఐరన్, కాల్షియం శరీరానికి లభిస్తాయి

ఉపాధి దొరుకుతుంది



వేసవి కాలంలో తాటి ముంజలను అమ్మడం వలన మాకు ఉపాధి దొరుకుతుంది. మా గ్రామంలోని గౌడన్నల వద్ద నుంచి ఈ ముంజలను తీసుకొచ్చి వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై వంగపల్లి వద్ద పెట్టి అమ్ముతున్నాం. అన్ని ఖర్చులు పోను కొంతమేర లాభం చేకూరుతుంది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో గిరాకీ బాగానే ఉంటుంది. రూ.100కు డజన్ చొప్పున అమ్ముతున్నాం.

– అశోక్, తాటిముంజల విక్రయదారుడు, కొలనుపాక, ఆలేరు

ఎండ నుంచి ఉపశమనం



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న తాటిముంజలు కనిపించడంతో కారు ఆపి తీసుకున్నాం. ఎండ వేడి నుంచి తట్టుకోవడానికి తాటి ముంజలు ఉపయోగపడతాయి. అదేవిధంగా తాటిముంజలలో పోషక పదార్థాలు మెండుగా ఉండడంతో ఆరోగ్యానికి మంచిదని, ప్రతీ వేసవిలో ముంజలను తప్పకుండా తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి తింటాం.

– వేణుగోపాల్‌రెడ్డి, హైదరాబాద్

తల్లిదండ్రుల కలను నిజం చేస్తూ..

- జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన గిరి పుత్రిక



తల్లిదండ్రులతో సుష్మ

చివ్వెంల(సూర్యాపేట) : గిరి పుత్రిక జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై తల్లిదండ్రుల కల సాకారం చేసింది. గతంలో ఒకసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి ఎంపికకానప్పటికీ.. నిరుత్సాహపడకుండా ఈ సారి కష్టపడి చదివి జడ్జి పీఠంపై కూర్చుంది. చివ్వెంల మండలం రాజునాయక్ తండాకు చెందిన ధరావతు భాస్కర్, సంధ్య దంపతులకు కుమారుడు నిఖిల్‌నాయక్, కుమార్తె సుష్మ సంతానం. భాస్కర్ అడ్వకేట్ల వద్ద క్లర్క్‌గా పనిచేస్తూ తన కుమారుడు, కుమార్తెను లా చదివించాడు. అయితే రెండేళ్ల క్రితం కుమారుడు నిఖిల్‌నాయక్ మృతిచెందడంతో.. కుమార్తెను జడ్జిని చేసేందుకు శిక్షణ ఇప్పిస్తూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. పదో తరగతి వరకు సూర్యాపేటలో చదివిన సుష్మ, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో పూర్తి చేసింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని పెండెకంటి లా కాలేజీలో ఐదేళ్ల లా కోర్సులో చేరి 2020లో లా పూర్తి చేసింది. అనంతరం 2020లో సూర్యాపేట బార్ అసోషియేషన్‌లో సభ్యత్వం తీసుకుని, రంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తూ.. జూనియర్ సివిల్ జడ్జి పోస్టులకు కోచింగ్ తీసుకుంది. 2022లో సుష్మ మొదటిసారి జూనియర్ సివిల్ జడ్జి ఎంపికలో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా ఎంపిక కాలేదు. అయినా నిరుత్సాహపడకుండా 2024 జూలైలో నిర్వహించిన ప్రిలిమ్స్‌లో, నవంబర్‌లో నిర్వహించిన మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించింది. ఈ ఏడాది ఏప్రిల్ 4న నిర్వహించిన ఇంటర్వ్యూలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి, ఏప్రిల్ 30న వెల్లడించిన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో సెలక్ట్ అయ్యింది. తన తలిదండ్రుల కల సాకారం చేసినందుకు చాలా ఆనందంగా ఉందని సుష్మ పేర్కొంది. తమ కుమార్తె జడ్జిగా ఎంపిక కావడంతో సుష్మ తల్లిదండ్రులు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సుష్మను గ్రామస్తులతో పాటు మండల ప్రజలు అభినందించారు.

రయ్.. రయ్.. తాటి పయ్యల బండి



తాటి పయ్యల బండి.. బహుశా పట్టణాల్లో పుట్టి పెరిగిన వారికి ఈ బండి గురించి తెలియకపోవచ్చు. కానీ.. గ్రామాల్లోని పిల్లలకు వేసవి సెలవుల్లో తాటిముంజలు తిన్న తర్వాత వాటితో తాతలు బండి తయారుచేసి ఇస్తే రోజంతా ఉత్సాహంగా ఆడుకుంటూ ఉంటారు. యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేట గ్రామంలో శనివారం ఇద్దరు పిల్లలు తాటి పయ్యల బండితో ఆడుకుంటూ కనిపించారు. వీరిని చూసిన కొందరు 'ఆ రోజులు.. మళ్లీ రావు' అంటూ తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు.

- యాదగిరిగుట్ట రూరల్

ఆర్టీఐ కమిషనర్ల నియామకాన్ని పునఃపరిశీలించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గాదె వినోద్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): ఆర్టీఐ కమిషనర్లుగా రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని.. ప్రస్తుతం జరిగిన ఆర్టీఐ కమిషనర్ల నియమాకాన్ని పునఃపరిశీలించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన ఆర్టీఐ కమిషనర్ల నియామకాన్ని పునఃపరిశీలించాలని శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో సామాన్య ప్రజలకు న్యాయం జరగాలంటే సమాచార కమిషనర్లుగా న్యాయబద్ధంగా వ్యవహరించే వారిని నియమించాలని కోరారు. సమాచార కమిషనర్ల నియామకంలో పారదర్శకత పాటించాలని అనర్హులను ఎంపిక చేయొద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంబిఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ రజీవుద్దిన్, సీనియర్ జర్నలిస్ట్ కోటగిరి దైవాధీనం, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, సమాచార హక్కు సంరక్షణ సమితి అధ్యక్షుడు బండమీది అంజయ్య, ఆశ్రిత సంస్థకు చెందిన ధనమ్మ, సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బైరు సైదులుగౌడ్, చిత్రం శ్రీనివాస్, ఆర్టీఐ కార్యకర్త కుడుతల రవీందర్, ఎస్సీ, ఎస్టీ చైర్మన్ గాదె యాదగిరి, ఆశ్రిత సంస్థ సభ్యులు శోభ, ఎం. శోభారాణి, అమత, రాజు, సీతా, వంశీ, కె. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరీశుడికి వసంతోత్సవ సేవ



వసంతోత్సవ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలో శనివారం శ్రీవేంకటేశ్వరస్వామికి వసంతోత్సవ సేవ నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం 4500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, సహస్ర దీపాలంకరణ, మంగళహారతులు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మంటల్లో బైక్ దగ్ధం

చింతపల్లి: మంటల్లో బైక్ దగ్ధమైన ఘటన చింతపల్లి మండలం కిష్టరాయనిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టరాయనిపల్లి గ్రామానికి చెందిన మోర శ్రీరాములు తన పల్సర్ బైక్‌ను రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి తన ఇంటి పక్కనే ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో శ్రీరాములు తండ్రి మోర రామచంద్ర బహిర్భూమికి వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు రాగా.. పల్సర్ బైక్ మంటల్లో తగలబడుతూ కనిపించింది. వెంటనే విషయాన్ని శ్రీరాములుకు చెప్పడంతో అతడు వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. తన బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని శ్రీరాములు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీల పట్టివేత

- ఏపీ నుంచి తెలంగాణకు తరలించి బోనస్ కాజేసే యత్నం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు



పట్టుబడిన లారీలను చూపుతున్న డీఎస్పీ రాజశేఖర రాజు, పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీలను పోలీసులు పట్టుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రాజశేఖర రాజు విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏపీ కంటే తెలంగాణలో ధాన్యానికి మంచి ధర లభిస్తుండటంతో పాటు క్వింటాల్ సన్న ధాన్యానికి ఇక్కడి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుండడంతో.. కొందరు అక్రమార్కులు ఏపీ రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి రాత్రివేళ నాగార్జునసాగర్, వాడపల్లి చెక్‌పోస్టులు దాటించి నల్లగొండ జిల్లాలోకి తీసుకొస్తున్నారు. శుక్రవారం వాడపల్లి చెక్‌పోస్టు నుంచి జిల్లాలోని అక్రమంగా ప్రవేశిస్తున్న 7 లారీలను పట్టుకోగా.. శనివారం ఉదయం మరో ధాన్యం లారీని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఎనిమిది లారీల్లో సుమారు 2200 ధాన్యం బస్తాలు (165టన్నులు) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఏపీలోని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, ఒంగోలు, కర్నూలు, నెల్లూరు జిల్లాల నుంచి వస్తున్న సుమారు వంద లారీలను వెనక్కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. ఏపీ నుంచి తరలివచ్చే ధాన్యాన్ని నల్లగొండ, హుజూర్‌నగర్, నిజామాబాద్ జిల్లా, ఖానాపూర్‌కు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ వ్యవహారంలో 14మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. పూర్తి విచారణ అనంతరం నిందుతుల వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐలు లక్ష్మయ్య, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి దుర్మరణం



శ్రీరామమూర్తి (ఫైల్)

చౌటుప్పల్: లిఫ్ట్‌లో ఎక్కేందుకు యత్నించిన వ్యక్తి లిఫ్ట్ గుంతలో పడి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా వినుకొండ మండలం గంగవరం గ్రామానికి చెందిన సిరిగిరి శ్రీరామమూర్తి(39) చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో గల దివీస్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గత పదిహేళ్ల నుంచి భార్యాపిల్లలతో కలిసి చౌటుప్పల్‌లో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు రావడంతో శ్రీరామమూర్తి భార్య ప్రశాంతి పిల్లలను తీసుకొని వారం క్రితం బాపట్ల జిల్లా ఇరుకులం మండలం తిమిడితపాడు గ్రామంలోని తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. దివీస్ పరిశ్రమలోనే పనిచేస్తూ చౌటుప్పల్‌లోని రత్నానగర్‌కాలనీలో నివాసముంటున్న తన మిత్రుడు అమర్నేని రమేష్ ఇంటికి శుక్రవారం రాత్రి శ్రీరామమూర్తి వెళ్లాడు. అక్కడ భోజనం చేసిన తర్వాత నాలుగో అంతస్తు నుంచి కిందికి దిగేందుకు లిఫ్ట్ బటన్ నొక్కాడు. అయితే లిఫ్ట్ రాక ముందే వచ్చిందని భావించిన శ్రీరామమూర్తి బలవంతంగా డోర్ తెరిచి లిఫ్ట్‌లో ఎక్కేందుకు యత్నించి లిఫ్ట్ గుంతలో పడిపోయాడు. భారీ శబ్దం రావడంతో ఇంట్లో ఉన్న రమేష్ బయటకు వచ్చి గమనించగా తీవ్ర గాయాలతో శ్రీరామమూర్తి కన్పించాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే శ్రీరామమూర్తి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుర్రంపోడు: గాలి వానకు తెగిపడిన సర్వీస్ వైరును సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం కాల్వపల్లి గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వపల్లి గ్రామానికి చెందిన పంగ యాదయ్య ఇంటి సర్వీస్ వైరు గత రాత్రి కురిసిన గాలి వానకు తెగిపడింది. దీంతో గ్రామంలో కరెంట్ పనులు చేసే కొండమీది అశోక్(40)ను వైరు సరిచేసేందుకు తీసుకెళ్లాడు. అశోక్ సర్వీస్ వైరును సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. హుటాహుటిన అతడిని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వీడిన హత్య కేసు మిస్టరీ



సాయికుమార్ (ఫైల్)

ములుగు(గజ్వేల్): సిద్దిపేట జిల్లా ములుగు మండలం బస్వాపూర్ శివారులో జరిగిన గుర్తుతెలియని యువకుడి హత్య మిస్టరీ వీడింది. మృతుడు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దాచారం సాయికుమార్ (25)గా పోలీసులు గుర్తించారు. మృతుడు పశువులకాపరి అని, అతడు కనిపించకుండా పోయినట్లు తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదైందని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. తుర్కపల్లిలో మిస్సింగ్ కేసు నమోదైన నేపథ్యంలో తదుపరి విచారణ తుర్కపల్లి పోలీసులు నిర్వహిస్తారని వివరించారు.

బాలికపై అత్యాచారయత్నం

కొండమల్లేపల్లి: బాలికపై విద్యుత్ ఉప కేంద్రంలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్న వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో గల 11కేవీ 133 విద్యుత్ ఉప కేంద్రంలో అనుముల శ్రీను ఆర్టిజన్ విధులు నిర్వహిస్తూ వినాయక్‌నగర్‌లో నివాసముంటున్నాడు. గురువారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో వినాయక్‌నగర్‌లో కరెంటు పోయింది. ఆ సమయంలో అదే కాలనీలో నివాసముంటున్న 14ఏళ్ల బాలికపై శ్రీను అత్యాచారం చేసేందుకు యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో శ్రీను అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీనుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన భూక్య చిన్నా కుటుంబ కలహాలతో శనివారం గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటి తర్వాత 108కు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగినట్లు సమాచారం ఇచ్చాడు. 108 సిబ్బంది ఎర్రబెల్లి శ్రీనివాస్, సైదయ్య గ్రామానికి చేరుకుని చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతకగా ఓ చెట్టు కింద అపస్మారకస్థితిలో చిన్నాను గుర్తించి.. అతడి సెల్‌ఫోన్ తీసుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వాడపల్లి పోలీసులు పేర్కొన్నారు.

108 అంబులెన్స్‌ను ఢీకొట్టిన మరో అంబులెన్స్



ప్రమాదానికి గురైన అంబులెన్స్

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న 108 అంబులెన్స్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న మరొక 108 అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహాడ్ గ్రామ పంచాయతీ సమీపంలోని బాపూజీనగర్ వద్ద శనివారం జరిగింది. ప్రమాదానికి గురైన అంబులెన్స్‌ను తప్పించబోయి దేవరకొండకు ప్యాసింజర్‌లను ఎక్కించుకొని వెళ్తున్న ఆటో పల్టీ కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులతో పాటు అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు అంబులెన్స్, ఆటోను స్టేషన్‌కు తరలించారు.

నేతన్న రుణమాఫీకి ముందడుగు

- రూ.లక్ష లోపు రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల
- ఉమ్మడి జిల్లాలో 1832 మంది చేనేత కార్మికులకు రూ.12.94 కోట్ల లబ్ధి



భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల రుణమాఫీకి ముందడుగు పడింది. అసలు, వడ్డీ కలుపుకొని రూ.లక్ష లోపు ఉన్న చేనేత రుణాలను మాఫీ చేస్తూ ప్రభుత్వం రెండు నెలల క్రితం జీఓ నంబర్ 56ను జారీ చేసింది. రుణమాఫీ కోసం రూ.33 కోట్ల నిధులను మంజూరు చేసింది. కానీ రుణమాఫీ విధివిధానాలు ఖరారు కాకపోవడంతో రెండు నెలలుగా రుణమాఫీ ప్రక్రియ మొదలుకాలేదు. దీంతో ఎప్పుడెప్పుడు రుణమాఫీ చేస్తారని కార్మికులు ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ రుణమాఫీ అమలుకు రెండు రోజుల క్రితం మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రక్రియను పూర్తిచేసి జూన్ నెలాఖరు వరకు చేనేత కార్మికుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమచేసేలా కసరత్తు చేస్తోంది.

మార్గదర్శకాలు ఇవే..

రుణాలు పొందిన కార్మికుల జాబితాను చేనేత, జౌళిశాఖ ఏడీలు బ్యాంకుల వారీగా తీసుకుంటారు. వాటిని జిల్లాల వారీగా క్లెయిమ్‌లను తయారుచేసి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీలో సభ్యులుగా ఉండే డీసీసీబీ సీఈఓ, చేనేతశాఖ ఆర్‌డీడీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డు డీజీఎం, పరిశ్రమల శాఖ జీఎం, జిల్లా సహకార అధికారుల ఆమోదం అనంతరం రాష్ట్రస్థాయి కమిటీకి ప్రతిపాదిస్తారు. చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అధ్యక్షత వహించే రాష్ట్ర స్థాయి కమిటీలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ, టెస్కాబ్, నాబార్డు రాష్ట్రస్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించిన తర్వాత రుణమాఫీ మొత్తం ఆయా చేనేత కార్మికుల ఖాతాల్లో జమవుతుంది. అనంతరం బ్యాంకర్లు బకాయిలు లేవని నో డ్యూ సర్టిఫికెట్ జారీ చేస్తారు. రుణమాఫీ అనంతరం కార్మికులు కోరుకుంటే తిరిగి బ్యాంకులు రుణాలు జారీ చేస్తారు.

2024 మార్చి 31 వరకు ఉన్న రుణాలకే వర్తింపు..

2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారికే ఈ రుణమాఫీ వర్తిస్తుంది. వృత్తి పనిచేస్తున్న చేనేత కార్మికులు తీసుకున్న వ్యక్తిగత రుణాలు, చేనేత వస్త్రాల ఉత్పత్తికి, వృత్తి సంబంధ కార్యకలాపాలు, ముద్ర రుణాలన్నింటిని మాఫీ చేయనుంది.

ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారులు..

యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న 1162 మందికి రూ.8.04కోట్ల రుణమాఫీ జరుగనుంది. అందులో భూదాన్‌పోచంపల్లిలో 234 మంది కార్మికులకు రూ.1,17,82,200 రుణమాఫీ కానుంది. అదేవిధంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కలిపి 670 మంది చేనేత కార్మికులకు గాను రూ.4.90 కోట్లు రుణమాఫీ లబ్ధి చేకూరనుంది.

సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేసినందుకు సంతోషం. చేనేత కార్మికుల రుణమాఫీ అమలుకై స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ద్వారా పలుమార్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. వచ్చే నెలాఖరు వరకు కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హామీ ఇచ్చారు. చేనేత కార్మికుల పక్షాన సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– తడక వెంకటేశం, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు

ప్రక్రియ మొదలుపెడతాం



మార్గదర్శకాలు అందిన వెంటనే చేనేత రుణమాఫీ ప్రక్రియను మొదలుపెడతాం. గతంలో రూ.2లక్షల లోపు ఉన్న కార్మికుల జాబితాను బ్యాంకర్ల నుంచి తీసుకొని ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తున్నందున తిరిగి రూ.లక్ష లోపు రుణాలు ఉన్న కార్మికుల జాబితాను రూపొందించి జిల్లా స్థాయి కమిటీ ఆమోదించిన తర్వాత రాష్ట్రస్థాయి కమిటీకి పంపిస్తాం. అక్కడ ఆమోదం పొందిన వెంటనే కార్మికుల ఖాతాలో డబ్బులు జమవుతాయి.

– శ్రీనివాస్, చేనేత, జౌళిశాఖ ఏడీ, యాదాద్రి భువనగిరి జిల్లా

క్లుప్తంగా

సమాజ సేవే లక్ష్యం



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

సూర్యాపేట అర్బన్ : సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వాసవీ యూత్ క్లబ్ ప్రెసిడెంట్ వెంపటి రవితేజ, రీజియన్ సెక్రటరీ యామ సంతోష్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతిరోజూ దాతల సహకారంతో 2000 మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం రాము, బికుమళ్ల కృష్ణ, మైలవరపు సతీష్, తొణుకునూరి సంతోష్, సూక రవిశంకర్, చింత వెంకన్న, మిరియాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోదీకి రుణపడి ఉంటాం

తాళ్లగడ్డ (సూర్యాపేట) : బీసీలమంతా ప్రధాని నరేంద్ర మోదీకి రుణపడి ఉంటామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ అన్నారు. దేశవ్యాప్తంగా జనగణనలో కుల గణన చేస్తామని కేంద్రం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేట పట్టణంలోని ఎంజీ రోడ్డులో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు కంచుకొమ్ముల వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి వెంకన్న యాదవ్, బండపల్లి శ్రీనివాస్ గౌడ్, తన్నీరు వాసుదేవ్, కోడి లింగ యాదవ్, మమతపురం వెంకటేశ్వర్లు, ఎలగందుల వెంకటేశ్వర్లు, బంటు నాగేందర్, జక్కుల రామచందర్ యాదవ్, గంగాధర జానకి రాములు పాల్గొన్నారు.

అవర్లీ బేస్డ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

నాగారం: మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న అవర్లీ బేస్డ్ టీచర్ల(హెచ్‌బీటీ) సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మోడల్ స్కూల్స్ విభాగం అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఒక పీరియడ్‌కి రూ.75 నుంచి రూ.182లకు పనిచేస్తున్నామని పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీకి అందిస్తున్న రూ.390లను హెచ్‌బీటీలకు కూడా వర్తింపజేయాలని కోరారు. జూన్ 2 వరకు రెన్యువల్ ఆర్డర్స్ వచ్చేలా చూడాని కోరగా ఏడీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో టాపర్‌కు సన్మానం



మధుమితకు అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరిస్తున్న మనం ఫౌండేషన్ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : పదవ తరగతి ఫలితాల్లో 555 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన చెరుకూరు మధుమితను శనివారం మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్ మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన మధుమిత ఉన్నత లక్ష్యంతో చదివి మండలంలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మనం ఫౌండేషన్ అధ్యక్షుడు గంపల కృపాకర్, నారాయణ, బంటు శంకర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేస్తామని ప్రకటించడం హర్షణీయం



మాట్లాడుతున్న తన్నీరు రాంప్రభు

తిరుమలగిరి : కేంద్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో జనాభా లెక్కలతోపాటు కుల గణన చేస్తామని ప్రకటించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు అన్నారు. శనివారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1931 సంవత్సరంలో బ్రిటీష్ వారి కాలంలో జనాభాను కులాల వారిగా లెక్కించారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ ప్రభుత్వం కూడా కులాల వారిగా జనాభా లెక్కలు చేయలేదని అన్నారు. ఈ సమావేశంలో వంగరి బ్రహ్మం, ముద్దంగుల యాదగిరి, రామ్మూర్తి, రాములు, ఉపేందర్ గౌడ్, సోమయ్య, వెంకన్న, మురళి, రవి, రాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- రోజుల తరబడి కేంద్రాలలోనే పడిగాపులు కాస్తున్న రైతులు



బొల్లంపల్లిలోని కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు

అర్వపల్లి : ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోకపోవడంతో కేంద్రాలలో ధాన్యం రాశులు ఎక్కడికక్కడే ఉన్నాయి. రోజుల తరబడి రైతులు కేంద్రాల వద్ద నిరీక్షిస్తూ ఆందోళన చెందుతున్నారు. నెల రోజులకు పైనుంచి కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో ఈసీజన్ నందు సెర్ప్, పీఏసీఎస్, మ్యాక్స్, ఎన్‌డీసీఎంఎస్, ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే మిల్లులలో సకాలంలో దిగుమతి కాకపోవడం, మిల్లుల కేటాయింపు జరుగకపోవడం, గన్నీ బస్తాల కొరత, లారీలు సరిపడ రాకపోవడం ప్రధాన సమస్యలుగా మారాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే రెండుసార్లు అకాల వర్షాలు పడి కొంతవరకు ధాన్యం తడిసి రైతులు నష్టపోయారు. మళ్లీ వాతావరణంలో మార్పులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా చూడాలి. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉంటున్నారు. కొనుగోళ్లలో జాప్యం జరుగకుండా వెంట వెంటనే పూర్తిచేయాలి.

– కేసాని రాహుల్, బొల్లంపల్లి

ధాన్యం పోసి నెల దాటింది



జాజిరెడ్డిగూడెంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నెలరోజులు దాటింది. కేంద్రంలో 800 బస్తాల ధాన్యం పోసి పెట్టాను. ఇంతవరకు కొనుగోలు చేయలేదు. కేంద్రాల్లో రేయింబవళ్లు ధాన్యం వద్ద కాపలా ఉండాల్సి వస్తోంది.

– నిమ్మల రాజు, జాజిరెడ్డిగూడెం

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సైదులు

సూర్యాపేట అర్బన్ : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ సిబ్బంది వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు శనివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధిహామీ సిబ్బంది, ఏపీఓ, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లకు మూడు నెలల నుంచి వేతనాలు రావడంలేదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు 4 నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందికి వేతనాలు లేకుంటే క్షేత్రస్థాయిలోకి వెళ్లి గ్రామీణ ఉపాధి కూలీలకు పనులు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. ఉపాధి హామీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నూతనకల్ : పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ సిబ్బంది వేతనాలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ నిధులను కేంద్ర ప్రభుత్వం సొంత అవసరాల కోసం వాడుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులుసు సత్యం, అందెపల్లి లక్ష్మయ్య, పులసరి వెంకటముత్యం, బత్తుల రవి, మంగమ్మ, వెంకటమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం శాంతిచర్చలు జరపాలి

నూతనకల్ : కేంద్ర ప్రభుత్వం కర్రెగుట్ట ప్రాంతంలో చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూసు సైదులు, తొట్ల లింగయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీ దళార్చన



అలంకరణలో దేవతామూర్తులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని బొడ్రాయి బజారులో గల శ్రీవేదాంత భజన మందిరంలో శనివారం శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్లకు లక్ష తులసీ దళార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు దేవతామూర్తుల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, నూతన పట్టు వస్త్రాలను అలంకరించారు. అనంతరం లక్ష తులసీ దళార్చన కార్యక్రమం నిర్వహించారు. వేడుకలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీసీతారామ లక్ష్మణ స్వామి అష్టోత్తర పారాయణం చేశారు. కార్యక్రమంలో అర్చకులు దరూరీ సింగరాచార్యులు, రాఘవాచార్యులు, మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, కమిటీ సభ్యులు సోమ సుమన్, షీలా శంకర్, కక్కిరేణి విజయ్, వరగాని వెంకటేశ్వర్లు, వాస కృష్ణ, వెంపటి అప్పారావు, చిత్తలూరి శ్రీధర్ రావు, చల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న తిరుమల ప్రగడ అనురాధ

తుంగతుర్తి : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తగూడెంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కేంద్రంలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాహుల్ గాంధీ పిలుపుమేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని దేశమంతా చేపట్టడం జరుగుతోందని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మాచర్ల అనిల్, పూసపల్లి భిక్షం, మారోజు అంజయ్య, కొమురవెల్లి, కాసర్ల గణేష్, పరశురాములు, సజన్, కొండరాజు, రవి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : నాగారం మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్/జూనియర్ కళాశాలలో 2025–2026 విద్యా సంవత్సరానికిగానూ ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బల్గూరి చంద్రబాబు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు సంబంధించి 40సీట్ల చొప్పున మొత్తం 160 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 5 నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను మే26న నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తామని, అనంతరం మే 27 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల ధ్రువీకరణ, సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఎలాంటి ఫీజు లేదని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్: 9398109152, 9492362945 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 2025– 26 సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ ఇంగ్లిష్ మీడియం గ్రూపులకుగాను ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉంటాయని తెలిపారు. బాలికలకు ఉచిత హాస్టల్ వసతి ఉంటుందని, ఆసక్తి గలవారు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మల్టీపర్పస్ వర్కర్లకు రక్షణేదీ..?

- శానిటైజర్లు, బూట్లు, రేడియం జాకెట్లు ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం
- అనారోగ్య సమస్యలతో పారిశుద్ధ్య సిబ్బందికి ఇబ్బందులు



మండల కేంద్రంలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు(ఫైల్)

పెన్‌పహాడ్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యం కాపాడటంలో మల్టీపర్పస్ వర్కర్లది కీలక పాత్ర. అయితే వారి ఆరోగ్యానికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వహిస్తోంది. పెన్‌పహాడ్ మండల పరిధిలోని 29 గ్రామాల్లో మొత్తం 70మంది మల్టీపర్పస్ వర్కర్లు వీధుల్లో రోడ్లు ఊడుస్తున్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడం, చెత్తాచెదారం ఎత్తడం వంటి పనులు చేస్తున్నారు. అయితే వారికి రక్షణ సామగ్రిని అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మల్టీపర్పస్ వర్కర్లకు చేతిగ్లౌజులు, సబ్బులు, మాస్కులు, శానిటైజర్లు, హెల్మెట్లు, బూట్లు, రేడియంతో కూడిన జాకెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అవేమీ ఇవ్వకుండానే అధికారులు వారితో పనులు చేయిస్తున్నారు. ఒక్కోసారి మురుగు కాల్వల్లో పూడిక తొలగిస్తుండగా గాజుముక్కలు గుచ్చుకుంటున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రక్షణ సామగ్రి అందేలా చూడాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

రక్షణ సామగ్రి అందిస్తాం



పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్లు నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతుంటారు. వారికి రక్షణ సామగ్రి అందించాలని గతంలో కార్యదర్శులను ఆదేశించాం. త్వరలో పంచాయతీల నిధుల నుంచి రక్షణ సామగ్రి అందేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళి



విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడకులస్తులు

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి పండుగ సందర్భంగా శనివారం గౌడకులస్తులు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు తాళ్లపెల్లి యాదగిరి, రేసు లింగయ్య, శిలివేరు లింగరాజు, తొన్నునూరి లక్ష్మణ్, రేసు వెంకన్న, లక్ష్మణ్, ఉపేందర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్



మద్దిరాల : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : తాటిపాముల గ్రామంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. శనివారం ఆయన తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాటిపాముల గ్రామంలో రూ.16 కోట్లతో యశ్వంతాపూర్ వాగుపై (బిక్కేరు వాగు) బ్రిడ్జి నిర్మాణం, రూ.7 కోట్లతో చెక్ డ్యామ్ నిర్మాణం, రూ.3 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. అలాగే రూ.60 లక్షలతో గ్రామంలో పూర్తి చేసిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారని అన్నారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గత పది సంవత్సరాల కాలంలో తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్, జమ్మిలాల్, కందుకూరి అంబేద్కర్, యాదవరెడ్డి, కడెం పరమేశ్వర్, కందుకూరి లక్ష్మయ్య, ఎండీ.హఫీజ్, బత్తుల శ్రీను, ఎర్ర యాదగిరి, అబ్బాస్, నరేష్, కృష్ణ పాల్గొన్నారు.

కంఠమహేశ్వర స్వామి వేడుకలకు హాజరు..

తుంగతుర్తి : తూర్పుగూడెం గ్రామంలో జరుగుతున్న కంఠమహేశ్వర స్వామి ఉత్సవాల్లో శనివారం ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, నల్లు రామచంద్రా రెడ్డి, మల్లేష్, మహేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో జరుగుతున్న శ్రీకంఠమహేశ్వరస్వామి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, పచ్చిపాల సుమతి, రేసు లింగయ్య, తాళ్లపెల్లి యాదగిరి, శ్యాంరెడ్డి, ఎల్లు అశోక్‌రెడ్డి, వల్లపు రమేష్, శిలివేరు లింగరాజు, చామకూరి శ్రీనివాస్, దండెంపల్లి ఉమేష్, వెంకట్‌రెడ్డి, కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మల్లు లక్ష్మి, తదితరులు

ఆత్మకూర్ (ఎస్) : ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. శనివారం ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్‌లో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్రాలకు సరిపడా గన్నీ బ్యాగులు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కాంటాలు వేగవంతం చేయాలన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నరసింహారావు, మండల కార్యదర్శి ఆవిరి అప్పయ్య, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ బిల్డర్స్ వ్యవస్థాపకుడు మొరిశెట్టి శ్రీనివాస్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ సోదరుడు మొరిశెట్టి శ్రీనివాస్(55) శనివారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ హైదరాబాద్‌లో సాహితీ బిల్డర్స్ వ్యవస్థాపకుడిగా, క్రెడాయ్ హైదరాబాద్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారు. శ్రీనివాస్ మృతికి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ సంతాపం తెలిపారు. శ్రీనివాస్ అంత్యక్రియలు ఆదివారం హైదరాబాద్‌లోని కొత్తపేట అష్టలక్ష్మి కమాన్ ప్రాంతంలో జరుగుతాయని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

అర్వపల్లి దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం



దేవాలయ నూతన కమిటీ సభ్యులతో నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన నూతన కమిటీని శనివారం ఆలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన అనిరెడ్డి రాజేందర్‌రెడ్డితో దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే ధర్మకర్తలుగా జెర్రిపోతుల సోమయ్య, ఆకుల సోమయ్య, బీరవోలు శ్రీధర్‌రెడ్డి, అర్చకుడు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి సన్మానించి మాట్లాడారు. అర్వపల్లి దేవాలయానికి పూర్వ వైభవం తేవడానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి రాజయ్య, నారబోయిన అంజయ్యగౌడ్, సతీష్‌రెడ్డి, రమావత్ శేఖర్, రాంబాబు, మడ్డి పద్మ, కొమిరెల్లి, కృష్ణమూర్తి, అమీనుద్దీన్, గిరిబాబు, లాలునాయక్, బాషపోలు శ్రీను, భిక్షం, ఉపేందర్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బోయలపల్లి రేఖకు సన్మానం

అడివెంల గ్రామానికి చెందిన రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికై తొలిసారిగా అర్వపల్లికి వచ్చిన సందర్భంగా శనివారం కాంగ్రెస్ నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, దేవస్థాన చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి రాజయ్య, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, నారగోని అంజయ్యగౌడ్, మాజీ సర్పంచ్ పద్మ, దేవస్థాన ధర్మకర్తలు తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపీడీఓ తిరునగరి గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కూలీలు పనులు చేయాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తేలు పరశురాములు, మేట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీజ్ చేసిన ఇసుక సరఫరా

పెన్‌పహాడ్ : అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందజేసినట్లు తహసీల్దార్ లాలు తెలిపారు. దోసపహాడ్ గ్రామ శివారులోని మూసీ పరివాహక ప్రాంతంలో ఇటీవల అధికారులు 15ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు. ఆ ఇసుకను శనివారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని దుబ్బతండా గ్రామానికి చెందిన ఏడుగురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపికృష్ణ, పంచాయతీ కార్యదర్శి జాని, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న బడిబాట ప్రచారం



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో బడిబాట ప్రచారంలో పాల్గొన్న ఎంఈఓ బాలునాయక్

అర్వపల్లి : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓ బి. బాలునాయక్ కోరారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ కుంభం వెంకటరమణ, బింగి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు నోముల వెంకటేశ్వర్లు, ఆర్.సైదులు, డి.రమేష్, సైదులు, చంద్రకళ, పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీహరి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపి ఫీజులతో ఇబ్బందులు పడవద్దని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే సొంత నిధులతో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, టై, బెల్ట్, షూ అందిస్తామని అన్నారు.

సభను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి : రైతాంగ సాయుధ పోరాట యోధుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఈ నెల 9న జరిగే స్తూపం ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బీఎన్ రెడ్డి పేద ప్రజల కోసం ఎర్ర జెండా చేతబట్టి పోరాటం చేశారని అన్నారు. 9న మండల కేంద్రంలో నిర్వహించే సభకు ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎమ్మెల్యే మందుల సామేల్, వామపక్ష పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు రమేష్, పెద్ద నరసయ్య, పవన్, కళ్యాణ్, రాములు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు

అర్వపల్లి : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ హెచ్చరించారు. శనివారం స్థానిక వైజంక్షన్‌లో వాహనచోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యంతాగి వాహనాలు నడిపిన వారు జైలుకు వెళ్లడం తప్పదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మేకల రాములు, సిబ్బంది నాగయ్య, పోగుల శ్రీను, సతీష్‌వర్మ, అన్వర్, శ్రీను పాల్గొన్నారు.